

ఇక.. నేలమట్టం చేస్తారా?
కాకతీయ యూనివర్సిటీ భూముల ఆక్రమణలు జరిగాయనే ఆరోపణలు, ఫిర్యాదుల నేపథ్యంలో విజిలెన్స్ అధికారుల విచారణ కొనసాగుతోంది. - 8లో▸



ముంపు ప్రాంతాల్లో శాస్త్రవేత్తల పర్యటన
మరిపెడ మండలంలోని ముంపు గ్రామాల్లో గురువారం వ్యవసాయ శాస్త్రవేత్తలు పర్యటించారు. - 8లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం $32^0/23^0$

జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం వేళ ఎండ ఉంటుంది. సాయంత్రం సమయంలో ఆహ్లాదకరంగా ఉంటుంది.

పోకిరీలు.. పరుగో.. పరుగు

మహిళలకు రక్షణగా నిలుస్తున్న షీ టీమ్స్
- మఫ్టీలో సిబ్బంది...ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే అంతే సంగతులు
- నగరంలో 260 హాట్‌స్పాట్‌లు
- ఈ ఏడాది 214 ఫిర్యాదులు

వరంగల్ క్రైం: వరంగల్ మహానగరంలోని కళాశాలలు...పాఠశాలలు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, షాపింగ్ మాల్స్ వంటి రద్దీ ప్రాంతాల్లో అమ్మాయిలు, మహిళలను టీజ్ చేసే యువకుల భరతం పడుతున్నాయి షీ టీమ్స్. పోకిరీలను పరుగులు పెట్టిస్తున్నాయి. ఎవరైనా ఈవ్‌టీజింగ్‌కు పాల్పడినా, అసభ్యకరంగా మాట్లాడినా మహిళలు వరంగల్ రామన్నపేటలో ఉన్న షీటీమ్స్ పోలీస్‌స్టేషన్‌కు నేరుగా, ఆన్‌లైన్‌లో ఫిర్యాదులు చేస్తున్నారు.

ట్రై సిటీ పరిధిలో 260హాట్ స్పాట్‌లు..

ట్రిసిటీ పరిధిలో ర్యాగింగ్‌కు పాల్పడే ప్రాంతాలు (హాట్‌స్పాట్లు) 260 వరకు ఉన్నట్లు గుర్తించారు. ఈ ప్రాంతాల్లో షీ టీమ్స్ అధికారులు, సిబ్బంది నిత్యం నిఘా పెడుతున్నారు. ఉదయం, సాయంత్రం మఫ్టీలో తిరుగుతున్నట్లు సమాచారం. ఈ ఏడాదిలో ఇప్పటివరకు వివిధ ప్రాంతాల్లో ర్యాగింగ్‌కు పాల్పడినట్లు 214 మంది యువతులు ఫిర్యాదు చేశారు. కౌన్సెలింగ్ దశలో పద్ధతి మార్చుకోని 92మందిపై కేసులు నమోదు చేశారు.



అవగాహన కార్యక్రమాలు
కళాశాలల్లో షీటీమ్స్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పరిచయం లేని వ్యక్తులతో వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాలో చాటింగ్ చేయడం వల్ల ఎదురయ్యే ఇబ్బందులు, జీవితం మీద ఎలాంటి ప్రభావం చూపుతున్నాయి, ఆన్‌లైన్ ప్రేమలు, కేరీర్, తదితర అంశాలపై యువతీయువకులకు అవగాహన కల్పిస్తున్నారు. మహిళలను వేధిస్తే జీవితం ఎలా నాశనమవుతుందనే దానిపై యువకులకు దిశానిర్దేశం చేస్తున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి ఆగస్టు వరకు 102 కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

తల్లిదండ్రులు పిల్లలను గమనిస్తూ ఉండాలి


పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే పిల్లల ప్రవర్తనను తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలి. వారి సెల్‌ఫోన్ చెక్ చేస్తూ ఉండాలి. ప్రధానంగా అమ్మయిలు ఏదైనా సమస్య ఎదురైతే తల్లిదండ్రులకు, షీటీమ్స్ అధికారులకు చెప్పడానికి ధైర్యంగా ముందుకు రావాలి. ఫొటోల షేరింగ్ భవిష్యత్‌లో ఇబ్బందులకు గురిచేస్తుంది. పోకిరీలు అమ్మాయిల ఫొటోలను మార్ఫింగ్ చేసి వేధిస్తున్న ఘటనలు పెరిగిపోతున్నాయి. జాగ్రత్తగా ఉండాలి.

- కోడూరి సుజాత, షీ టీమ్స్ ఇన్‌స్పెక్టర్

ఈ యేడాది షీటీమ్స్ స్టేషన్‌లో ఫిర్యాదులు, కేసులు ఇలా..

నెల	జనవరి	ఫిబ్రవరి	మార్చి	ఏప్రిల్	మే	జూన్	జూలై	ఆగస్టు	మొత్తం
ఫిర్యాదులు	21	21	36	29	28	27	29	23	214
నమోదైన కేసులు	09	09	14	19	13	13	08	07	92
అవగాహన కార్యక్రమాలు	21	15	10	10	15	02	14	15	102

న్యూస్‌రీల్

హేరంభ గణపతిగా మూల మహా గణపతి


హన్మకొండ కల్చరల్: రుద్రేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న శ్రీఉత్తిష్ట గణపతి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఆరో రోజు గురువారం మూల మహా గణపతిని హేరంభ గణపతిగా అలంకరించారు. ఆలయ ప్రధానార్చకులు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో అర్చకులు ఉదయం నుంచి రుద్రేశ్వరస్వామికి రుద్రాభిషేకం, పూజలు నిర్వహించారు. తూర్పు గోదావరి, రాజమండ్రి ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. మంచికట్ల గోపీనాథ్ సౌజన్యంతో కూచిపూడి నృత్యప్రదర్శనలు అలరించాయి.

నిట్‌లో పీహెచ్‌డీ స్కాలర్ల ధర్నా


కాజీపేట అర్బన్: నిట్‌లోని అడ్మినిస్ట్రేటివ్ మెయిన్ బిల్డింగ్ ఎదుట పీహెచ్‌డీ స్కాలర్లు గురువారం ధర్నాకు దిగారు. రాత్రీ పగలు తేడా లేకుండా పరిశోధనల్లో నిమగ్నమై కళాశాలకు ఆలస్యంగా వస్తే బయోమెట్రిక్‌లో హాజరుపడడం లేదని వాపోయారు. నెలలు గడుస్తున్నా.. ఫెలోషిప్‌ను విడుదల చేయలేదని, ప్రతీ నెల స్టైఫండ్ ఆలస్యమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే సమస్యలు పరిష్కరించాలని లేకపోతే రాబోయే రోజుల్లో నిట్ మెయిన్ గేట్ ఎదుట ఆమరణ దీక్షకు దిగుతామని హెచ్చరించారు. సానుకూలంగా స్పందించిన నిట్ యాజమాన్యం పీహెచ్‌డీ స్కాలర్ల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు సమాచారం.

ఐటీఐలో ప్రవేశానికి అవకాశం
కాజీపేట: జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం నాలుగో విడత ప్రవేశాలకు ఈనెల 20వ తేదీ లోపు అవకాశం కల్పించారు. పదో తరగతి ఉత్తీర్ణత పొంది 14 ఏళ్లు నిండిన ఆసక్తి గల విద్యార్థులు వెబ్‌సైట్ iti.telangana.gov.in లో దరఖాస్తు చేసుకోవాలని కాజీపేట ప్రిన్సిపాల్ పి.వెంకటేశ్వర్ రావు సూచించారు. కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారు 20వ తేదీన ఉదయం 11 గంటల వరకు సంబంధిత కళాశాలకు హాజరు కావాలని పేర్కొన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తుతో పాటు అన్ని ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని సూచించారు.

18 నుంచి డీఈఐఈడీ పరీక్షలు
విద్యారణ్యపురి: ప్రభుత్వ డైట్ కళాశాల డీఈఐఈడీ విద్యార్థులకు ఈనెల 18 నుంచి 24వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి డి.వాసంతి ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తారని పేర్కొన్నారు. విద్యార్థులు హాల్ టికెట్లను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్ఈ.తెలంగాణ.గౌట్.ఇన్ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు.

వైద్యశిబిరాలు నిర్వహించండి
ఎంజీఎం: సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు ప్రతీ గ్రామంలో, పట్టణ ఆరోగ్య కేంద్రాల పరిధిలో ప్రత్యేక వైద్యశిబిరాలు నిర్వహించాలని డీఎంహెచ్‌ఓ లలితాదేవి ఆదేశించారు. గురువారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో సీజనల్ వ్యాధులు, ఇంటింటా సర్వే, మెడికల్ క్యాంపు నిర్వహణ, పీహెచ్‌సీలు, ప్రైవేట్ ఆస్పత్రుల్లో నిర్వహించిన తనిఖీలపై చర్చించారు. కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్‌ఓ మదన్‌మోహన్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ విజయ్‌కుమార్, డీఐఓ మహేందర్, ప్రోగ్రాం అధికారులు హిమబిందు, డెమో అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీకేఎంలో స్కానింగ్ కష్టాలు
- రేడియాలజిస్టుల బదిలీతో గర్భిణులకు తప్పని తిప్పలు
- ఒక్కరితోనే స్కానింగ్ సేవల నిర్వహణ
- గంటల తరబడి ఎదురుచూపులు


స్కానింగ్ కోసం ఎదురుచూస్తున్న గర్భిణులు

ఎంజీఎం: సీకేఎం ఆస్పత్రిలో స్కానింగ్ సేవల కోసం గంటల తరబడి ఎదురు చూపులు తప్పడం లేదు. గర్భిణులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ సాధారణ బదిలీల్లో భాగంగా సీకేఎం ఆస్పత్రిలో పని చేస్తున్న రేడియాలజిస్టుల బదిలీ పేద గర్భిణులకు శాపంగా మారింది. ఆస్పత్రిలో రేడియాలజిస్టులుగా విధులు నిర్వర్తించే డాక్టర్ వనజ, రాంబాబు బదిలీ కావడంతో పీజీ వైద్యుడి చేత స్కానింగ్ సేవలు నిర్వహిస్తున్నారు. ఆస్పత్రిలో ప్రతీ రోజు 300 నుంచి 500 మంది గర్భిణులు ఓపీ విభాగం ద్వారా సేవలు పొందుతున్నారు. 100 నుంచి 150 మంది గర్భిణులు ఇన్‌పేషెంట్లుగా సేవలు పొందుతారు. కాగా.. గర్భిణులకు టిఫా ఫెటల్, డాప్లర్, అబ్డామిన్, న్యూరో, వంటి స్కానింగ్‌లు చేస్తుంటారు. ప్రైవేట్ డయాగ్నస్టిక్ కేంద్రాల్లో ఈ స్కానింగ్ సేవలు పొందాలంటే వేలాది రూపాయలు చెల్లించాలి. కానీ.. సీకేఎం ఆస్పత్రిలో ఉచితంగా ఈ సేవల్ని అందిస్తుంటారు. ప్రతీ రోజు సుమారు 70 నుంచి 100 మంది గర్భిణులకు స్కానింగ్ సేవలు నిర్వహించి శిశువు ఎదుగుదలను గమనించి ఆ నివేదికలకు అనుగుణంగా గైనకాలజీ వైద్యులు చికిత్సలు అందిస్తారు. ప్రస్తుతం ఆ సేవలు నామమాత్రంగానే అందించడంతో పేద గర్భిణులకు స్కానింగ్ తిప్పలు తప్పడం లేదు.

గంటల తరబడి నిరీక్షణ

సీకేఎం ఆస్పత్రిలో రేడియాలజిస్టుల కొరత వేధిస్తోంది. ఒకే ఒక పీజీ వైద్యుడు స్కానింగ్‌లు నిర్వహిస్తున్నారు ఒక స్కానింగ్ చేసేందుకు సుమారు 10 నుంచి 20 నిమిషాల సమయం పడుతుంది. ఈసేవల కోసం గర్భిణులు గంటల తరబడి వేచిచూడక తప్పడం లేదు. అంతేకాకుండా బదిలీ జరిగిన రేడియాలజిస్టుల స్థానంలో కొత్త వారిని కేటాయించకపోవడంతో పేద గర్భిణులకు స్కానింగ్ సేవల్లో ఇబ్బందులు తప్పట్లేదు. ఈక్రమంలో గురువారం సేవలందించే పీజీ వైద్యుడు విధులకు హాజరవకపోవడంతో స్కానింగ్ సేవలు పూర్తి స్థాయిలో నిలిచిపోయాయి. ఈవిషయంపై సీకేఎం సూపరింటెండెంట్‌ను వివరణ కోరేందుకు 'సాక్షి' ప్రయత్నించగా.. ఆమె అందుబాటులోకి రాలేదు. రాష్ట్ర, జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరించేలా చొరవ తీసుకోవాలని గర్భిణులు కోరుతున్నారు.

అతిపెద్ద కార్యకర్తల సమూహం బీజేపీ
పార్టీ దళిత మోర్చా జాతీయ ప్రధాన కార్యదర్శి శంభునాథ్ తుండియా


కార్యకర్తలకు సభ్యత్వం ఇస్తున్న దళిత మోర్చా జాతీయ ప్రధాన కార్యదర్శి శంభునాథ్ తుండియా

హన్మకొండ : ప్రపంచంలోనే అతిపెద్ద కార్యకర్తల సమూహం భారతీయ జనతా పార్టీ అని ఆ పార్టీ దళిత మోర్చా జాతీయ ప్రధాన కార్యదర్శి, గుజరాత్ రాష్ట్ర శాసనసభ్యుడు శంభునాథ్ తుండియా అన్నారు. గురువారం హనుమకొండ హంటర్ రోడ్‌లోని సత్యం కన్వెన్షన్‌లో దళిత మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ అధ్యక్షతన బీజేపీ సభ్యత్వ నమోదు-2024 కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని శంభునాథ్ తుండియా జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కొండేటి శ్రీధర్ తోపాటు పలువురు నాయకులు ఆయన చేతుల మీదుగా సభ్యత్వాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా శంభునాథ్ తుండియా మాట్లాడుతూ వికసిత భారత్ లక్ష్యంగా, దళిత పక్షపాతిగా నిలుస్తున్న బీజేపీలో ప్రతి ఒక్కరూ చేరాలని పిలుపునిచ్చారు. అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని భారతీయ జనతా పార్టీ తప్పక పాటిస్తుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం చైర్మన్, సభ్యత్వ నమోదు ప్రముఖ్ మార్తినేని ధర్మారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శృతి, వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, దళిత మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్, నాయకులు జయపాల్, అరూరి రమేశ్, ప్రొఫెసర్ ఆజ్మీర సీతారాం నాయక్, ఎడ్ల అశోక్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనులు పూర్తి చేయండి


ఈవీఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

హన్మకొండ: వరంగల్ అర్బన్ జిల్లా ప్రజా పరిషత్, మండల ప్రజా పరిషత్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను అధికారులు సమన్వయంతో పని చేసి సకాలంలో పూర్తి చేయాలని జెడ్పీ ప్రత్యేకాధికారి, హనుమకొండ కలెక్టర్ పి.ప్రావీణ్య సూచించారు. గురువారం హనుమకొండలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో వరంగల్ అర్బన్ జిల్లా ప్రజాపరిషత్ పరిధి ఎంపీడీఓలు, సూపరింటెండెంట్లు, జెడ్పీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇందులో అభివృద్ధి పనులపై మండలాల వారీగా సమీక్షించారు. ఈసందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. జిల్లాలో మొత్తం 58 అభివృద్ధి పనులకు రూ.1.31 కోట్ల నిధులను కేటాయించినట్లు తెలిపారు. జిల్లా పరిషత్ ఆవరణలో ఖాళీగా ఉన్న భవనానికి మరమ్మతులు చేయించి సీనియర్ సిటిజన్స్ కోసం డే కేర్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ ఎం.విద్యాలత, డిప్యూటీ సీఈఓ రవి, ఎంపీడీఓలు తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం గోదాంల తనిఖీ

వరంగల్: వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డులో ఈవీఎంల గోదాంను కలెక్టర్ పి.ప్రావీణ్య గురువారం అధికారులు, గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తనిఖీ చేశారు. ఆమె వెంట అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, సంబంధిత అధికారులున్నారు.

నిమజ్జన ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలి
సీపీ అంబర్ కిషోర్ ఝా, కలెక్టర్ ప్రావీణ్య


సిద్ధేశ్వర గుండాన్ని పరిశీలిస్తున్న అధికారులు

వరంగల్ క్రైం: ఈనెల 16న ట్రై సిటీ పరిధిలో నిర్వహించే గణేశ్ నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా నిర్వహించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. నగరంలోని గణేశ్ నిమజ్జనం జరిగే కాజీపేట బంధం చెరువు, హనుమకొండలోని సిద్ధేశ్వర గుండం, హసన్‌పర్తి చెరువులను గురువారం అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. నిమజ్జనం జరిగే ప్రాంతాల్లో ఏర్పాటు చేయాల్సిన క్రేన్లు, సిబ్బంది నియామకం, విద్యుత్, బారికేడ్ల నిర్మాణం, తెప్పల ఏర్పాట్లపై చర్చించారు. కార్యక్రమంలో బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా, ఏసీపీలు తిరుమల్, జితేందర్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఓరుగల్లులో హైడ్రా గుబులు



కలకలం రేపుతున్న సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటన
- గ్రేటర్ పరిధి చెరువులు, నాలాలపై ఇప్పటికే నివేదిక..
- ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ నిర్మాణాలపై ఆరా
- 'హైడ్రా'కు పోలీసు, రెవెన్యూ అధికారాలు..
- 'రియల్' మాఫియాలో గుబులు

సాక్షిప్రతినిధి, వరంగల్ :

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కబ్జాదారులను హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్-అసెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) కలవరపెడుతోంది. హైదరాబాద్ తరహాలో అన్ని జిల్లాల్లో డిజాస్టర్ రెస్పాన్స్-అసెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్ ఏజెన్సీల ఏర్పాటుకు ప్రభుత్వం చేస్తున్న కసరత్తు గుబులు రేపుతోంది. పోలీసు, రెవెన్యూ అధికారాలు కల్పించడంతోపాటు అన్ని జిల్లాల్లోని ఆక్రమణలను తొలగించేందుకు యంత్రాంగాన్ని సన్నద్ధం చేస్తామని ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి చేసిన ప్రకటనతో 'రియల్' మాఫియాకు చెమటలు పడుతున్నాయి. నాలాలను ఆక్రమించి.. చెరువులను తొక్కేసి ఆకాశహర్మ్యాలు నిర్మించుకున్న వారిలో గుబులు మొదలైంది. ఇరిగేషన్, మున్సిపల్, రెవెన్యూ, 'కుడా'లో కొందరు అధికారులను మేనేజ్ చేసి అపార్టుమెంట్లు, విల్లాలు, ఇళ్లు నిర్మించి విక్రయించిన వారు చేతులు పిసుక్కుంటున్నారు. చెరువులను ఆక్రమించిన వారు ఇక చెరసాలలకే అన్న ప్రభుత్వ నినాదం కలకలం రేపుతోంది. వరంగల్, హనుమకొండ, కాజీపేట ట్రై సిటీ పరిధి చెరువులు, నాలాలు, కుంటల గూగుల్‌మ్యాప్స్, 20 ఏళ్లక్రితం శాటిలైట్ చిత్రాలు, నగర పరిధి పెరగకముందు వాటి విస్తీర్ణం, ఆక్రమణల తీరును పవర్ పాయింట్ ప్రజెంటేషన్ లాగా తయారు చేస్తున్నారు.

మరోసారి సర్కారు దృష్టికి... సిద్ధమైన నివేదికలు..

ప్రభుత్వ స్థలాలు, చెరువులు, నాలాలు, కుంటల ఆక్రమణలు గ్రేటర్ వరంగల్, ఆ చుట్టుపక్కల అత్యధికంగా జరిగినట్లు నిఘావర్గాలు ఇప్పటికే ఉప్పందించాయి. చారిత్రాత్మకమైన భద్రకాళి, వడ్డేపల్లి, చిన్న వడ్డేపల్లి, బంధం చెరువు సహా 38కిపైగా చెరువులు కుచించుకుపోయాయి. అక్రమార్కులపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు మరింత లోతుగా నివేదికలు సిద్ధం చేస్తున్నారు. గ్రేటర్ వరంగల్ పరిధిలో సుమారు 4,892 ఎకరాల విస్తీర్ణంతో ఉండాల్సిన 170 చెరువులు.. చాలాచోట్ల ఆక్రమణలకు గురైనట్లు 'కుడా' సైతం ఇటీవల ఓ నివేదిక తయారు చేసింది. ఇదే సమయంలో ఆక్రమణలకు గురైన చెరువులు ఎన్ని? ఎక్కడెక్కడ ఎంతమొత్తంలో కబ్జాకు గురయ్యాయి? అన్న రిపోర్టులను ఇరిగేషన్‌శాఖ రూపొందించగా... ఆ కబ్జాకు గురైన చెరువుల వెనుక ఉన్న ప్రముఖులు ఎవరు? అనే కోణంలో ఇంటిలిజెన్స్ వర్గాలు ఆరా తీస్తున్నాయి. ఇదే సమయంలో చెరువుల్లో ఆక్రమణల తొలగింపే కాదు.. వాటిని పూర్వ స్థితికి తేవడం కోసం ఏం చేయాలి? అన్న కోణంలో కూడా నివేదికలను రూపొందిస్తున్నారు. హైదరాబాద్ తర్వాత అదే తరహాలో వరంగల్ నగరంలో చెరువులు, నాలాలు ఆక్రమణలకు గురైనట్లు ఇప్పటికే గుర్తించిన ప్రభుత్వం... త్వరలోనే 'హైడ్రా' పరిధిలోకి తీసుకెళ్లడమా? అదే తరహాలో ఏజెన్సీని నియమించడమా? అనే మీమాంసకు తెరవేసేలా పావులు కదుపుతుండడం చెరువులను మింగిన 'రియల్' మాఫియాను కలవరపెడుతోంది.

నేడు ఓటరు జాబితాల ప్రదర్శన
వరంగల్: వరంగల్ జిల్లాలో గ్రామ పంచాయతీల వారీగా తయారుచేసిన ముసాయిదా ఓటరు జాబితాలను శుక్రవారం గ్రామ పంచాయతీలు, ఎంపీడీఓ కార్యాలయాల్లో ప్రదర్శించనున్నట్లు ఇన్‌చార్జ్ డీపీఓ జి.రాంరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఏమైనా అభ్యంతరాలుంటే ఈనెల 14 నుంచి 21వ తేదీ వరకు అధికారులకు అందజేయాలని ఆయన సూచించారు.

విదేశీ విద్యకు దరఖాస్తుల ఆహ్వానం
వరంగల్: విదేశీ విద్యనభ్యసించాలనుకునే ఎస్సీ విద్యార్థులకు నేషనల్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సాయం అందించనున్నట్లు వరంగల్ జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి పి.భాగ్యలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థి డిగ్రీ/పీజీలో 60 శాతం మార్కులు, సంవత్సర ఆదాయం రూ.8 లక్షలకు మించరాదని, కులం, ఆదాయం, నివాసం సర్టిఫికెట్లు, పాస్‌పోర్టు, వీసా, అక్రిడిటేషన్ పొందిన విదేశీ యూనివర్సిటీ/సంస్థ నుంచి అడ్మిషన్ లెటర్ కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఒక కుటుంబం నుంచి ఇద్దరు విద్యార్థులకు మాత్రమే స్కాలర్‌షిప్ అందుతుందని తెలిపారు. www.nosmsjc.gov. inలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రేపు డీఏఓతో ఫోన్ ఇన్


ఖిలా వరంగల్: వరంగల్ జిల్లాలో అధిక వర్షాలతో దెబ్బతిన్న పంటలను కాపాడుకునేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశంపై 'సాక్షి' ఫోన్‌ఇన్ కార్యక్రమం నిర్వహించనుంది. శనివారం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు రైతులు తమ సందేహాలను జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కె.అనురాధను నేరుగా అడిగి తెలుసుకోవచ్చు.

తేది : 14-09-2024 (శనివారం)
వరంగల్ జిల్లా రైతులు ఫోన్ చేయాల్సిన నంబర్ : 72888 94705
సమయం : ఉదయం 10 నుంచి 11 గంటల వరకు

వరద బాధితులను కేంద్రం ఆదుకోవాలి
సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాస్ రావు


అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు, కార్యకర్తలు

హన్మకొండ: ఇటీవల రాష్ట్రంలో కురిసిన అతి భారీ వర్షాలకు నష్టపోయిన రైతులు, వరద బాధితులను కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాస్ రావు డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని వరద బాధితులను కేంద్రం ఆదుకోవాలని కోరుతూ.. సీపీఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద పార్టీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈసందర్భంగా శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. ఇటీవలి వర్షాలు, వరదలను జాతీయ విపత్తుగా ప్రకటించి రాష్ట్రానికి రూ.10 వేల కోట్ల సహాయాన్ని ప్రకటించాలని డిమాండ్ చేశారు. లేకపోతే సీపీఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, జిల్లా మాజీ కార్యదర్శి సిరబోయిన కరుణాకర్, జిల్లా సహాయ కార్యదర్శులు తోట భిక్షపతి, మద్దెల ఎల్లేశ్, నాయకులు మునిగాల భిక్షపతి, జక్కు రాజుగౌడ్, కొట్టెపాక రవి, ఏశబోయిన శ్రీనివాస్, సారంగపాణి, నేదునూరి రాజమౌళి, బత్తిని సదానందం, అనుకారి అశోక్, ప్రణీత్‌గౌడ్, గడ్డం రాజనర్సు, కండే నర్సయ్య, రొంటాల శ్యామ్, పూర్ణచందర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులకు పరిహారం అందించాలి

వరంగల్: భారీ వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ ఎదుట సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బుస్స రవీందర్ అధ్యక్షతన గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మేకల రవి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా భారీగా కురిసిన వర్షాలతో చెరువులు, కుంటలు, వాగులు తెగి పంటలు దెబ్బతిన్నాయని తెలిపారు. ఎకరాకు రూ.30 వేల పరిహారం చెల్లించాలని, తక్షణమే రూ.10వేల కోట్లు వరద సహాయ నిధికి పంపించాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పనాస ప్రసాద్, నాయకులు గుండె బద్రి, పరికరాల రమేశ్, తాళ్లపల్లి రా హేల, వలబోజు వెంకన్న పాల్గొన్నారు.

అధికార పార్టీ నేత చెరలో సర్కారు భూమి
- భూమి విలువ రూ.2కోట్లకుపైనే..
- రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన కరువు


సర్కారు భూమిలో చేపట్టిన నిర్మాణం

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం వంగపహాడ్‌లో సుమారు 25 గుంటల ప్రభుత్వ భూమిని అధికార పార్టీ నేత కబ్జా చేసినట్లు ప్రచారం జరుగుతోంది. సర్వేనంబర్ 516లో సుమారు 501 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో 148 ఎకరాల మేరకు రంగనాయకుల స్వామి గుట్ట విస్తరించి ఉండగా, కొంత భూమి ఆ గ్రామానికి చెందిన నిరుపేదలకు అసైన్డ్ చేశారు. ప్రస్తుతం 52 ఎకరాల మేరకు సర్కారు ఆధీనంలో ఉంది. ఇందులో 2012లో అప్పటి ప్రభుత్వం నాలుగు ఎకరాలను మోడల్ స్కూల్‌కు కేటాయించింది.

మరో రెండెకరాలు వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘానికి ఇచ్చింది. మోడల్ స్కూల్‌కు కేటాయించిన స్థలం కూడా కబ్జాకు గురైంది. కొంత మంది వ్యక్తులు దర్జాగా ఈ భూమిలో నిర్మాణాలు చేపట్టారు. సొసైటీకి కేటాయించిన భూమిలో కూడా రియల్టర్లు పాగా వేశారు. ఈవ్యవహారం అప్పటి కలెక్టర్ దృష్టికి వెళ్లింది.

ఖాళీ స్థలంపై అధికార పార్టీ నేత కన్ను..

సర్వేనంబర్ 516లో ఖాళీగా ఉన్న స్థలంపై అధికార పార్టీ నేత కన్ను పడింది. సుమారు 0.25 గుంటల భూమి కబ్జా చేశాడు. జాతీయ రహదారికి పక్కనే ఉన్న ఈ భూమి విలువ రూ.2కోట్లకుపైనే ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. ఈ భూమిలో సదరు నేత నిర్మాణాలు కూడా చేపట్టాడు. ఈ విషయమై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించలేదని స్థానికులు తెలిపారు. ఈవిషయమై తహసీల్దార్ చల్లా ప్రసాద్‌ను వివరణ కోరగా సర్కార్ భూమి కబ్జా చేసి నిర్మాణాలు చేసినట్లు తన దృష్టికి వచ్చిందని తెలిపారు. ఎంతటి వారైనా వదిలిపెట్టేది లేదని, నిర్మాణాలు కూల్చివేసి భూమిని స్వాధీనం చేసుకుంటామని తెలిపారు.

క్లుప్తంగా

పలు రైళ్లకు ఎక్స్‌పర్మంటల్ స్టాప్

- ఆరు నెలల పాటు హాల్టింగ్‌కు గ్రీన్‌సిగ్నల్

కాజీపేట రూరల్ : కాజీపేట జంక్షన్ మీదుగా ప్రయాణించే పలు రైళ్లకు పలు రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఎక్స్‌పర్మంటల్ (ప్రయోగాత్మక) స్టాప్ కల్పిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు గురువారం తెలిపారు. ఆరు నెలల పాటు ఈ రైళ్లకు హాల్టింగ్ కల్పించనున్నట్లు వారు పేర్కొన్నారు.

ఈ స్టేషన్లలో రైళ్లకు స్టాప్..

ఈనెల 13వ తేదీ నుంచి ఆరు నెలల పాటు సికింద్రాబాద్–దానాపూర్ (12791) దానాపూర్ ఎక్స్‌ప్రెస్, దానాపూర్–సికింద్రాబాద్ (12792) ఎక్స్‌ప్రెస్‌కు జమ్మికుంటలో, ఈ నెల 14వ తేదీ నుంచి నర్సాపూర్–నాగర్‌సోల్ (12787) నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్, ఈ నెల 13వ తేదీ నుంచి నాగర్‌సోల్–నర్సాపూర్ (12788) నాగర్‌సోల్ ఎక్స్‌ప్రెస్‌కు మహబూబాబాద్‌లో, ఈ నెల 20వ తేదీ నుంచి పూణె–కాజీపేట (22152) పూణె ఎక్స్‌ప్రెస్, ఈ నెల 22వ తేదీ నుంచి కాజీపేట–పూణె (22152) పూణె ఎక్స్‌ప్రెస్‌కు మంచిర్యాల రైల్వే స్టేషన్‌లో హాల్టింగ్ కల్పించినట్లు రైల్వే అధికారులు తెలిపారు.

సింగపూర్‌లో ఉద్యోగం పేరుతో మోసం..

- రూ 6.93 లక్షలు తీసుకున్న బ్రోకర్
- పోలీస్‌స్టేషన్‌లో బాధితుడి ఫిర్యాదు

హసన్‌పర్తి: సింగపూర్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని ఓ బ్రోకర్ తనను మోసం చేశాడని బాధితుడు తెలిపాడు. ఈ మేరకు గురువారం హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీస్ ఇన్‌స్పెక్టర్ చేరాలు కథనం ప్రకారం.. హసన్‌పర్తికి చెందిన నామ్ శివకుమార్ ఇదే ప్రాంతానికి చెందిన నన్నుంశెట్టి శ్రీహరికి సింగపూర్‌లో ఉద్యోగం ఆశ చూపాడు. ఇందుకు సింగపూర్ యూనివర్సిటీలో డిప్లొమా కోర్సు పూర్తి చేయాలని చెప్పాడు. ఆ యూనివర్సిటీలో అడ్మిషన్ ఇప్పించే బాధ్యత తనదేనని పేర్కొన్నాడు. దీనిని నమ్మిన శ్రీహరి విడతల వారీగా శివకుమార్‌కు రూ 6.93 లక్షలు ముట్టజెప్పాడు. ఈ క్రమంలో సింగపూర్‌కు వెళ్లడానికి కావాల్సిన పత్రాలు ఇవ్వకపోవడమే కాకుండా చంపుతానని బెదిరింపులకు పాల్పడుతున్నాడు. దీంతో తనను మోసం చేసిన శివకుమార్‌పై చర్యలు తీసుకోవాలని శ్రీహరి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ ఇన్‌స్పెక్టర్ చేరాలు తెలిపారు.

22న జిల్లా స్థాయి చెస్ పోటీలు

వరంగల్ స్పోర్ట్స్: వరంగల్ జిల్లా చదరంగ సమాఖ్య ఆధ్వర్యంలో ఈనెల 22వ తేదీన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి అండర్–15 బాలబాలికల చెస్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వహణ కార్యదర్శి పి. కన్నా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండ పబ్లిక్ గార్డెన్ సమీపంలోని టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు జనవరి 01, 2009 తర్వాత జన్మించిన వారై ఉండాలన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన నలుగురు బాలురు, నలుగురు బాలికలను నవంబర్‌లో వరంగల్‌లో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు జనన ధ్రువీకరణ పత్రంతో పాటు చెస్ బోర్డును తమ వెంట తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. వివరాలకు 90595 22986 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.



ఇక.. నేలమట్టం చేస్తారా?

కేయూ భూమిలో ఆక్రమణలు

- 13 మంది ఇళ్లు ఉన్నట్లు గుర్తింపు
- బౌండరీస్ ఫిక్స్ చేస్తూ మార్కింగ్ చేసిన విజిలెన్స్ అధికారులు
- ఒకటి,రెండు రోజుల్లో వర్సిటీకి సర్వే రిపోర్టు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ భూముల ఆక్రమణలు జరిగాయనే ఆరోపణలు, ఫిర్యాదుల నేపథ్యంలో విజిలెన్స్ అధికారుల విచారణ కొనసాగుతోంది. యూనివర్సిటీలోని న్యూ పీజీ హాస్టల్ భవనం సమీపంలోని బీసీ కాలనీ ప్రాంతంలోని 228 సర్వే నంబర్ భూమిలో విజిలెన్స్ అధికారులు ఆయా శాఖల సిబ్బందితో జాయింట్ ఇన్‌స్పెక్షన్ సర్వే చేపట్టారు. బౌండరీస్ ఫిక్స్ చేస్తూ మార్కింగ్ చేశారు. 229 సర్వే నంబర్‌లో ఆరు ఎకరాల 15 గుంటల భూమి ఉండాలనే కేయూ బిల్డింగ్ డివిజన్ అధికారుల వద్ద ఉన్న రికార్డుల ప్రకారం సర్వే నిర్వహించారు. ఇందులో కొంత భూమి ఆక్రమణ జరిగిందని గుర్తించారని సమాచారం. ఈ నేపథ్యంలో ఆక్రమణలదారులపై చర్యలు తీసుకోవాలని యూనివర్సిటీలో చర్చ సాగుతోంది.

ఒకటి,రెండురోజుల్లో వర్సిటీకి రిపోర్టు

కేయూలోని 229 సర్వే నంబర్‌భూమిలో ఆక్రమణలు జరిగాయని స్పష్టమవుతోంది. ఈ సర్వే సందర్భంగా రిజిస్ట్రార్ మల్లారెడ్డి అక్కడికి వచ్చి పరిశీలించారు. బిల్డింగ్ డివిజన్ అధికారి వాసుదేవరెడ్డి, ఇతర సిబ్బంది కూడా ఉన్నారు. ఆ 229 సర్వేనంబర్‌లోని భూమి వివరాల సర్వే రిపోర్టు ఇవ్వాలని యూనివర్సిటీ అధికారులు రెవెన్యూ అధికారులను కోరారు. ఈనెల 12 లేదా 13న సర్వే రిపోర్టు యూనివర్సిటీ అధికారుల చేతుల్లోకి రానుంది.

గతంలో కూడా ఆక్రమణలు జరిగినట్లు వెల్లడి

కాకతీయ యూనివర్సిటీలో 2022లో అప్పటి కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు సర్వే నిర్వహించారు. ఇందులోనూ 229 సర్వేనంబర్ భూమిలో ఆక్రమణలు జరిగినట్లు గుర్తించి రిపోర్టు ఇచ్చారు. అయితే పక్కన ఉండే వేరే సర్వే నంబర్ చూపి 229 సర్వేనంబర్ భూమిలో 13మంది ఇళ్లు నిర్మించుకున్నారనే ఆరోపణలున్నాయి. అప్పట్లోనే 13 మంది యజమానులకు మున్సిపల్ అధికారులు నోటీసులు జారీచేశారు. ఇందులో ప్రధానంగా కేయూకు చెందిన ముగ్గురు ఉద్యోగుల ఇళ్లు ఉన్నాయని వెల్లడైన విషయం విదితమే. అయినా అప్పటి అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. అలాగే, కేయూ ల్యాండ్‌కమిటీ చైర్మన్ నాగేంద్రబాబు కమిటీ రిపోర్టునూ అప్పటి యూనివర్సిటీ అధికారులు పట్టించుకోలేదు. ఈతాజా సర్వే రిపోర్టు రాగానే కేయూ భూమిలోని ఆక్రమణలు తొలగించి భూమిని స్వాధీనం చేసుకుంటారా లేదో అనే అంశంపై వేచి చూడాలి. కాగా, కేయూ పలివేల్పుల శివారు 412, 413, 414 సర్వేనంబర్లు, అలాగే లష్కర్ సింగారం శివారు 34 సర్వేనంబర్‌లో కూడా విజిలెన్స్‌అధికారుల జాయింట్ ఇన్‌స్పెక్షన్ జరిగింది. ఈప్రాంతంలో ఇంకా సర్వే పూర్తిచేయాల్సిందని కేయూ బిల్డింగ్ డివిజన్ అధికారులు చెబుతున్నారు.



కేయూలోని 229 సర్వేనంబర్‌లోని భూమి సర్వేను పరిశీలిస్తున్న రిజిస్ట్రార్ మల్లారెడ్డి

13 మంది ఇళ్లు ఉన్నట్లు గుర్తింపు!

విజిలెన్స్ అధికారులు వివిధ శాఖలతో కలిసి జాయింట్ ఇన్‌స్పెక్షన్ సర్వే నిర్వహించగా కేయూకు చెందిన 229 సర్వేనంబర్ భూమిలో 13 మంది ఇళ్లు ఉన్నట్లు గుర్తించారని సమాచారం. అందులో ఇద్దరు ముగ్గురు కేయూకు చెందిన ఉద్యోగుల ఇళ్లు కూడా ఉన్నట్లు గుర్తించారని తెలుస్తోంది. అక్కడ ఉన్న సీసీ రోడ్డులో కొంతభాగం యూనివర్సిటీకి చెందిన భూమిగా గుర్తించి మార్కింగ్ ఇచ్చారు. దీంతో అక్కడ నివాసమంటున్న వారిలో ఆందోళన మొదలైంది.

ఆక్రమణలను తొలగిస్తారా ?

కేయూలోని 229 సర్వేనెంబర్ భూమిలో సర్వే పూర్తయింది. ఆ భూమిలో ఆక్రమణలు జరిగినట్లు స్పష్టమైంది. ఇందులో 13మంది ఇళ్లు ఉన్నాయని బౌండరీల ఫిక్స్‌తో వెల్లడైంది. సర్వే రిపోర్టు సంబంధిత రెవెన్యూ అధికారుల నుంచి రానున్న నేపథ్యంలో ఇక ఆక్రమణలో ఉన్న ఇళ్లను తొలగించి యూనివర్సిటీ భూమిని స్వాధీనం చేసుకుంటారా లేదా అనే అంశం చర్చనీయాంశంగా మారింది. కేయూ భూమిలో 13 మంది ఇళ్లు ఉన్నట్లు గుర్తించిన విషయం యూనివర్సిటీ అధికారులు బుధవారం కేయూ ఇన్‌చార్జ్ వీసీ వాకాటి కరుణ దృష్టికి తీసుకెళ్లారు. అలాగే, రిజిస్ట్రార్ మల్లారెడ్డి.. బిల్డింగ్ డివిజన్ అధికారి వాసుదేవరెడ్డితో చర్చించారు. సర్వేరిపోర్టు రాగానే ఎలా ముందుకెళ్లాలనే విషయంలో చర్చించినట్లు సమాచారం. ఇదిలా ఉండగా ఇన్‌స్పెక్షన్ రిపోర్టును రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించే అవకాశం ఉంది.

ముంపు ప్రాంతాల్లో శాస్త్రవేత్తల పర్యటన

- క్షేత్రస్థాయిలో దెబ్బతిన్న పంటల పరిశీలన

మరిపెడ రూరల్: మండలంలోని ముంపు గ్రామాలు ఉల్లెపల్లి, సీతారాంతండా, బాల్నిధర్మారం గ్రామాల్లో గురువారం వ్యవసాయ శాస్త్రవేత్తలు పర్యటించారు. ఈ సందర్భంగా వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ జి.వీరన్న, డాక్టర్ వి.సతీశ్‌చంద్ర, మాల్యాల కృషి విజ్ఞాన కేంద్రం వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ ఎస్ మాలతి, డాక్టర్ కిశోర్ కుమార్, బి. క్రాంతికుమార్ ముంపు ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి భారీ వర్షాలకు దెబ్బతిన్న వరి, పత్తి, ఆయిల్ పామ్ తదితర పంటలను పరిశీలించారు. వరదల తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు వివరించారు. కార్యక్రమంలో డీఏఓ ఎం.విజయనిర్మల, ఏడీఏ విజయ్‌చంద్ర, ఏఓ బోడ వీరసింగ్, రైతు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్‌లో అంతరపంటలు లాభదాయకం..

కురవి: ఆయిల్‌పామ్ రైతులు అంతర పంటలు సాగు చేస్తే లాభదాయకంగా ఉంటుందని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి జినుగు మరియన్న, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎం.వి జయనిర్మల, వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ జి.వీరన్న, డాక్టర్ వి.సతీశ్‌చంద్ర అన్నారు. గురువారం మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాల్లో ఆయిల్ పామ్ పంటలను పరిశీలించారు.ఆ తోటల్లో అంతర పంటలను పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మల్యాల కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ ఎస్.మాలతి, డాక్టర్ ఎన్.కిశోర్, డాక్టర్ బి.క్రాంతికుమార్, డాక్టర్ ఇ.రాంబాబు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



మరిపెడ రూరల్: బాల్నిధర్మారంలో వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

ఏసోబుకు నేతల ఘన నివాళి

మడికొండ: కాజీపేట మండలం టేకులగూడెంలో గురువారం మావోయిస్టు నేత మాచర్ల ఏసోబు అలియాస్ జగన్ అలియాస్ రణధీర్‌దాదా సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతోపాటు పలువురు నేతలు ఏసోబు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నేతలు మాట్లాడుతూ అసమానతలు లేని సమాజం కోసం నాలుగు దశాబ్దాల పాటు అలుపెరుగని పోరాటం చేసిన యోధుడు మాచర్ల ఏసోబు అని పేర్కొన్నారు. ఈ సంస్మరణ సభలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, కార్పొరేటర్ జక్కుల రవీందర్, విరసం నేతలు ప్రొఫెసర్ కాశీం, బాలసాని రాజన్న, పౌరహక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారాయణరావు, గాదె ఇన్నయ్య, శాంతక్క రమాదేవి, సత్యేంద్ర, తెలంగాణ ప్రజాఫ్రంట్ జనగామ జిల్లా అధ్యక్షుడు పా కాల వెంకన్న, న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు నున్న అప్పారావు, అమరవీరుల బంధుమిత్రుల సంఘం, విప్లవ అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.



ఏసోబు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

'గురుకులం' స్పాట్ అడ్మిషన్లలో గందరగోళం

- రాత్రి ఎనిమిది గంటలైనా సీట్లు కేటాయించని అధికారులు
- విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన

మడికొండ: మడికొండలోని (వర్ధన్నపేట) బాలుర సాంఘిక సంక్షేమ పాఠశాలలో గురువారం నిర్వహించిన స్పాట్ అడ్మిషన్ల కౌన్సెలింగ్‌లో గందరగోళం నెలకొంది. రాత్రి ఎనిమిది గంటలైనా అధికారులు సీట్లు కేటాయించకుండా నిర్లక్ష్యం వహించారు. దీంతో అధికారుల తీరుపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అడ్మిషన్ల వద్ద కనీసం తాగునీరు కూడా ఏర్పాటు చేయలేదు. దీంతో ఉదయం నుంచి రాత్రి వరకు తల్లిదండ్రులు గుక్కెడు నీటి కోసం అల్లాడారు. ఆర్‌సీఓ, డీసీఓ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చివరికి కౌన్సెలింగ్ కేంద్రం వద్ద బైఠాయించి ఆందోళన చేపట్టారు. అధికారులు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా ఆందోళన కొనసాగించారు. కాగా, సీట్ల కేటాయింపు వివరాలు ఫోన్ ద్వారా తెలుపుతామని జోనల్ ఇన్‌చార్జ్ స్వరూపరాణి తెలిపారు. సీట్లు నిబంధనల ప్రకారం కేటాయించకుండా అధికారులు తమ ఇష్టానుసారం వ్యవహరిస్తున్నరని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆరోపించారు.



ఆందోళన చేస్తున్న విద్యార్థులు తల్లిదండ్రులు

వరంగల్ మార్కెట్‌కు 4 రోజులు సెలవు

వరంగల్: ఏనుమాములోని వరంగల్ వ్యవసాయ మార్కెట్‌కు వరుసగా నాలుగు రోజులు సెలవు ఉందని, ఈ సమయంలో యార్డుల్లో ఎలాంటి క్రయవిక్రయాలు జరగవని మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.నిర్మల ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 14న(శనివారం) వారాంతపు యార్డ్ బంద్,15న(ఆదివారం)వారాంతపు సెలవు, 16న(సోమవారం) వినాయక నిమజ్జనం, 17న(మంగళవారం)మిలాద్ ఉన్ నబీ (ప్రభుత్వ సెలవు) నేపథ్యంలో మార్కెట్ బంద్ ఉంటుందన్నారు. రైతులు, వ్యాపారులు, గుమస్తా, దడవాయి, కార్మికులు ఈ విషయాన్ని గమనించి ఎలాంటి సరుకులు తీసుకు రావొద్దని పేర్కొన్నారు. 18వ తేదీ(బుధవారం) మార్కెట్ పునఃప్రారంభమవుతుందన్నారు.

నాగ్‌పూర్–సికింద్రాబాద్ మధ్య వందేభారత్..

- కాజీపేట జంక్షన్‌లో హాల్టింగ్

కాజీపేట రూరల్ : కాజీపేట జంక్షన్ మీదుగా నాగ్‌పూర్–సికింద్రాబాద్ మధ్య వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను నడిపించనున్నట్లు రైల్వే అధికారులు గురువారం రాత్రి తెలిపారు. ఇప్పటికే కాజీపేట, వరంగల్ మీదుగా సికింద్రాబాద్–విశాఖపట్నం మధ్య వందేభారత్ ఎక్స్‌ప్రెస్ నడుస్తోంది. ప్రయాణికుల డిమాండ్ మేరకు సికింద్రాబాద్–నాగ్‌పూర్ మధ్య ఈ నెల 15వ తేదీ నుంచి వందే భారత్ ఎక్స్‌ప్రెస్ నడిపించేందుకు సర్వం సిద్ధం చేసినట్లు వారు తెలిపారు. ఈ రైలు వారానికి ఆరు రోజులు నడిపించనున్నారు. కాజీపేట జంక్షన్‌లో వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రారంభానికి పెద్ద ఎత్తున కార్యక్రమం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ రైలును ప్రధాని మోదీ వర్చువల్‌లో ప్రారంభించనున్నట్లు వివరించారు.

రైలు షెడ్యూల్..

ఈ నెల 15వ తేదీన నాగ్‌పూర్–సికింద్రాబాద్ (20101) వందేభారత్ ఎక్స్‌ప్రెస్ నాగ్‌పూర్‌లో ఉదయం 5 గంటలకు బయలుదేరి 10.04 గంటలకు కాజీపేట జంక్షన్‌కు, 12.15 గంటలకు సికింద్రాబాద్‌కు చేరుతుంది. అదేవిధంగా సికింద్రాబాద్–నాగ్‌పూర్ (20102) వందేభారత్ ఎక్స్‌ప్రెస్ సికింద్రాబాద్‌లో మధ్యాహ్నం ఒంటి గంటకు బయలుదేరి కాజీపేట జంక్షన్‌కు 14.20 గంటలకు చేరుకుని, రాత్రి 20.20 గంటలకు నాగ్‌పూర్‌కు చేరుతుంది. ఈ ఎక్స్‌ప్రెస్‌కు అప్‌అండ్‌డౌన్ రూట్‌లో సేవాగ్రామ్, చంద్రాపూర్, బల్లార్షా, రామగుండం, కాజీపేట రైల్వే స్టేషన్‌లో హాల్టింగ్ కల్పించారు. స్వల్ప మార్పులు, చేర్పులతో అధికారికంగా వందే భారత్ సమయ వివరాలను త్వరలో ప్రకటించనున్నట్లు అధికారులు తెలిపారు.

ఎయిడ్స్‌పై అవగాహన ఉండాలి

- ఎన్‌ఏసీఓ ఏడీజీ డాక్టర్ భవానీసింగ్



మాట్లాడుతున్న భవానీసింగ్

ఎంజీఎం: హెచ్‌ఐవీ/ఎయిడ్స్ సంక్రమించే విధానం, నివారణపై యువతకు పూర్తి అవగాహన ఉండాలని జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ (ఎన్‌ఏసీఓ) అడిషనల్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ భవానీసింగ్ అన్నారు. ఎన్‌ఏసీఓ బృందం గురువారం హనుమకొండ, వరంగల్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో పర్యటించింది. ముందుగా వారు నగరంలోని ఏవీవీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ భుజేందర్‌రెడ్డి అధ్యక్షతన విద్యార్థులతో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు హాజరయ్యారు. ఈసందర్భంగా ఎన్‌ఏసీఓ ఏడీజీ భవానీసింగ్ మాట్లాడుతూ.. విద్యార్థులు హెచ్‌ఐవీ గురించి లైంగికపరమైన అంశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండడమే కాకుండా.. ఇతరులతో స్వేచ్ఛగా మాట్లాడగలగాలన్నారు. అనంతరం ఎంజీఎం ఆస్పత్రిలోని ఏఆర్టీ సెంటర్, ఐసీటీసీ, వైరాలజీ ల్యాబ్‌లను బృంద సభ్యులు సందర్శించి అక్కడ అందిస్తున్న సేవలు, పరీక్షల నిర్వహణ, కౌన్సిలింగ్ , చికిత్స విధానాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎన్‌ఏసీఓ కన్సల్టెంట్ డాక్టర్ పారుల్‌సింగ్, టీజీఎస్‌ఏసీఎస్ అడిషనల్ పీడీ డాక్టర్ ప్రసాద్, ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ మురళి, అడిషనల్ డీఎంహెచ్‌ఓ టి.మదన్‌మోహన్‌రావు, ఏవీవీ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ చందా విజయ్‌కుమార్, ఎస్ఎం డాక్టర్ సీహెచ్. సూర్యప్రకాశ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కె.శ్రీనివాసరావు, డీఏపీసీయూ మేనేజర్ స్వప్న మాధురి, డెమో అశోక్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జక్కలొద్ది భూపోరాటానికి 'ఏచూరి' మద్దతు

- గుడిసెవాసులకు భరోసా
- ఇళ్ల స్థలాలు సాధించే వరకు అండగా ఉంటానని అభయం
- ఏచూరి మృతికి పలువురి సంతాపం

న్యూశాయంపేట: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి.. వరంగల్‌లో జరిగిన పోరాటాలకు మద్దతు తెలిపారు. గురువారం ఆయన మరణవార్త విన్న అభిమానులు, కమ్యూనిస్టు పార్టీల నాయకులు కన్నీటిపర్యంతమయ్యారు. రెండేళ్ల క్రితం సీపీఎం ఆధ్వర్యంలో వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో భూపోరాటాలు జరిగాయి. పేదలు తమ నివాస స్థలాలకోసం ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకున్నారు. రంగశాయిపేట శివారు జక్కలొద్ది భూపోరాట కేంద్రంగా ఉద్యమాలు నడిచాయి. 2022 జూలై 25, 26, 27 తేదీల్లో హనుమకొండ జిల్లా కాజీపేటలోని బాలవికాసలో తెలంగాణ రాష్ట్ర కమిటీ సమావేశాలు జరిగాయి. ఈ సమావేశాల్లో సీతారాం ఏచూరి పాల్గొన్నారు. సమావేశాల సందర్భంగా వరంగల్ జక్కలొద్ది భూపోరాట కేంద్రాన్ని సందర్శించి పేదల పోరాటానికి మద్దతుగా నిలిచి భరోసా కల్పించారు. ఇళ్ల స్థలాలు సాధించేవరకు పోరాటానికి మద్దతుగా ఉంటానన్నారు.

కాకతీయ యూనివర్సిటీలో..

2023 మార్చిలో కాకతీయ యూనివర్సిటీ సెమినార్ హాల్‌లో 'భారతదేశం ప్రస్తుత పరిస్థితులు– లౌకిక వాదం' అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌కు ప్రధాన వక్తగా విచ్చేసి ప్రసంగించారు.

సీపీఎం నాయకుల సంతాపం..

సీతారాం ఏచూరి మృతి కమ్యూనిస్టు ఉద్యమాలకు తీరని లోటని వరంగల్, హనుమకొండ జిల్లాల సీపీఎం నాయకులు అన్నారు. ఏచూరి మృతికి సంతాపం తెలుపుతూ ఆయా జిల్లాల పార్టీ కార్యాలయాల్లో ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు సారంపల్లి వాసుదేవరెడ్డి, ఎం.చుక్కయ్య, చక్రపాణి, ఉప్పలయ్య, ఆర్. రమేశ్, వరంగల్ జిల్లా సీఐటీయూ నాయకులు ఎం.సాగర్, జి.వెంకట్, లింగయ్య, వీరన్న, సీతారాం పాల్గొన్నారు.

సీపీఐ నేతలు..

సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతిపై సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి టి.శ్రీనివాస్‌రావు, హనుమకొండ జిల్లా కార్యదర్శి కె.భిక్షపతి ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు.



హనుమకొండలోని సీపీఎం కార్యాలయంలో ఏచూరికి నివాళులర్పిస్తున్న నాయకులు



వరంగల్ జక్కలొద్దిలో భూపోరాటాలకు మద్దతు తెలుపుతున్న ఏచూరి(ఫైల్)

డెంగీపై అప్రమత్తంగా ఉండాలి

గీసుకొండ: కీటక జనిత వ్యాధులు, డెంగీపై వైద్యులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండి దోమల వృద్ధిని అరికట్టేందుకు తగిన చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌ఓ కె.వెంకటరమణ అన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో వైద్యాధికారులు, సిబ్బందితో గురువారం నిర్వహించిన జూమ్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. నర్సంపేట డివిజన్‌లో డెంగీ జ్వరపీడితులు అధికంగా ఉన్నారని, సంబంధిత శాఖల సమన్వయంతో దోమల నివారణ మందు స్ప్రే చేయాలన్నారు. జిల్లాలో ఇంటింటి సర్వే చేపట్టి జ్వరపీడితులకు సత్వర వైద్యసేవలు అందించాలని ఆయన ఆదేశించారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు గోపాల్‌రావు, ప్రకాశ్, ప్రోగ్రాం అధికారులు మోహన్‌సింగ్, పద్మశ్రీ, డిప్యూటీ డెమో అనిల్‌కుమార్, ఇన్‌చార్జ్ ఏఎంఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

50 మందికి ఆఫర్ లెటర్లు

వరంగల్: వరంగల్ ములుగురోడ్డు సమీపంలోని ఐటీఐ క్యాంపస్‌లో ఉన్న హనుమకొండ ఉపాధి కల్పన కార్యాలయంలో గురువారం నిర్వహించిన మినీజాబ్ మేళాలో 50 మందికి ప్రొవిజనల్ ఆఫర్ లెటర్లు అందించినట్లు వరంగల్ జిల్లా ఉపాధి కల్పన అధికారి ఉమారాణి ఒక ప్రకటనలో తెలిపారు. హెచ్‌డీఎఫ్‌సీ, ఎస్ బ్యాంకు, ముత్తూట్ ఫైనాన్స్, శ్రీరాం ఇన్సూరెన్స్ సంస్థల్లోని 140 ఖాళీలకు ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు పేర్కొన్నారు.

పది కిలోల వెండి పట్టివేత

- వరంగల్ రైల్వేస్టేషన్ ఎదుట ఘటన

రామన్నపేట : వరంగల్ రైల్వేస్టేషన్ ఎదుట గురువారం రాత్రి ఏడు గంటల ప్రాంతంలో వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో ముగ్గురు వ్యక్తుల వద్ద పది కిలోల వెండి లభ్యమైనట్లు వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్ తెలిపారు. ఈ మేరకు ఇంతేజార్ గంజ్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఇంతేజార్ గంజ్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, ఎస్సై వెంకన్న, ఇంటర్‌సెప్టార్ సిబ్బంది రైల్వేస్టేషన్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో తమిళనాడులోని సేలంకి చెందిన కన్నన్, మురుగేషన్, గోకుల్ అనుమానాస్పదంగా కనిపించారు. దీంతో పోలీసులు వారిని తనిఖీ చేయగా పది కిలలో వెండి లభించింది. వెండికి సంబంధించిన బిల్లుల గురించి ప్రశ్నించగా ఎలాంటి ఆధారాలు చూపకపోవడంతో స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ నందిరాంనాయక్ తెలిపారు.

భద్రకాళి ఆలయంలో గతి తప్పిన పాలన



దేవాదాయశాఖ ఉప కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న పరిషత్ సభ్యులు



భద్రకాళి అమ్మవారు

- అడుగడుగునా డబ్బులు దండుకుంటున్న వ్యాపారులు
- ఈఓ శేషుభారతిపై దేవాదాయశాఖ ఉప కమిషనర్‌కు ఫిర్యాదు

హన్మకొండ కల్చరల్: ఓరుగల్లు ప్రజల ఇలవేల్పు భద్రకాళి అమ్మవారు. అమ్మ చల్లని చూపు కోసం వందల కిలోమీటర్లు ప్రయాణించి వస్తుంటారు. నిత్యం భక్తుల రద్దీతో కళకళలాడే ఈ ఆలయం ద్వారా దేవాదాయశాఖకు అధిక ఆదాయం సమకూరుతోంది. అమ్మవారి ఉత్సవాల కోసం లక్షల రూపాయలు విరాళంగా ఇచ్చే దాతలున్నారు. గుప్తంగా విరాళాలందించే దాతలు కూడా అనేకం. హుండీల నుంచి లభించే ఆదాయమే కాకుండా భక్తులు నిర్వహించే పూజా రుసుము ద్వారా లభించే ఆదాయం కూడా ఎక్కువే. ఇంతే కాకుండా.. పూలమాలలు, ప్రసాదాలు, ఒడిబియ్యం, ముడి సరుకులు, నెయ్యి, తేనె, తదితర సరుకులను అందించే దాతలెందరో ఉన్నారు. అమ్మవారి కైంకర్యాలకు దాతలు ఆదాయం అందించే దేవాలయం. ఇలాంటి దేవాలయం పాలన గాడి తప్పుతోంది. ఇటీవల కాలంలో భక్తులు అనేక ఇబ్బందులు పడుతున్నారు.

దర్జాగా దోపిడీ..

భద్రకాళి అమ్మవారి ఆలయంలోకి ప్రవేశించగానే కొబ్బరికాయలు, పూల అమ్మకం నుంచి దోపిడీ ప్రారంభమవుతుంది. దేవాలయం నిర్ణయించిన రుసుము కంటే.. దాదాపు 200 శాతం రెట్లు వసూలు చేస్తున్నారు. వారు ఇచ్చే పూల బుట్టలో నాసిరకం, వడలిపోయిన పూలు ఉంటాయి. భక్తులు నిలదీస్తే వ్యాపారులు దూషించడం పరిపాటిగా మారిపోయింది. వాహన పూజల కోసం కొనుగోలు చేసే పూజా సామగ్రి సైతం అధిక ధరకు విక్రయిస్తున్నారు. గతంలో దసరా నవరాత్రుల్లో రెండు నిమ్మకాయలు, జీడి గింజలు, అమ్మవారి రక్షను రూ.500కు విక్రయించారు. చెప్పుల స్టాండ్‌లో ఉచితం అని బోర్డు పెట్టినప్పటికీ డబ్బులు వసూలు చేస్తున్నారు. అంతే కాకుండా దేవాలయంలో పని చేసే ప్రైవేట్ అర్చకుల దందా మితిమీరిపోయింది. వాహన పూజల కోసం, అన్నప్రాసన, అక్షరాభ్యాసం తదితర పలు పూజలు నిర్వహించుకునేందుకు దేవాదాయశాఖ టికెట్ ధర భక్తులకు అందుబాటులో ఉన్నప్పటికీ.. అర్చకులు వేల రూపాయలు డిమాండ్ చేస్తున్నారు. అమ్మవారి బొట్టు పెట్టినందుకు, అమ్మవారికి సమర్పించిన పూలు ఇచ్చేందుకు కూడా డబ్బులు వసూలు చేయడం అన్యాయమని పలువురు భక్తులు ఆవేదన చెందుతున్నారు.

టెండర్ రద్దు చేయాలి..

అమ్మవారికి సమర్పించే చీర విషయంలో కూడా ఇటీవల వివాదం తలెత్తింది. దేవాలయంలో టెండర్ ప్రక్రియ ద్వారా కొనసాగుతున్న విధివిధానాలు ఉల్లంఘించిన వారి టెండర్ రద్దు చేయాలని భక్తులు కోరుతున్నారు. ఈమేరకు గురువారం భద్రకాళి దేవాలయం ఈఓ శేషుభారతి అధికార దుర్వినియోగంపై వరంగల్ దేవాదాయశాఖ ఉప కమిషనర్ శ్రీకాంతారావుకు రాష్ట్రీయ హిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు భూపాల్, జిల్లా అధ్యక్షుడు మడిపల్లి నాగరాజు గౌడ్ వినతిపత్రం అందజేశారు. ఫిర్యాదులో భద్రకాళి దేవాలయంలో భక్తులకు సరైన సౌకర్యాలు ఏర్పాటు చేయట్లేదని, వ్యాపారులు, సిబ్బంది భక్తులను దూషిస్తున్నట్లు పేర్కొన్నారు.

తక్కువ రేట్‌కు కోట్ చేస్తూ..

భక్తులు కొబ్బరికాయలు కొట్టిన తర్వాత వచ్చే నీటిని మళ్లీ భక్తులకే విక్రయిస్తుండడం అపరిశుభ్రంగా భావిస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. పూలు అధిక ధరకు అమ్ముతున్నారని, అమ్మవారికి సారె రూపంలో సమర్పించే చీరలు అతి ఖరీదైనవి తక్కువ రేటు కోట్‌చేస్తూ.. బయట అధిక ధరలకు అమ్ముతున్నారని పేర్కొన్నారు. దేవాలయ ఆడిటింగ్ విషయంలో ఇంకా ఎన్ని లోపాలు ఉన్నాయో గమనించాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. చెప్పుల స్టాండ్‌లో దేవాలయం ఉద్యోగి ఒక వ్యక్తిని పెట్టి డబ్బులు వసూలు చేస్తున్నారని, డబ్బులివ్వని వారిని దూషిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈఓ దృష్టికి తీసుకెళ్లినా చర్యలు తీసుకోకుండా వారికి సహకారం అందిస్తున్నారని పేర్కొన్నారు. ఈఓ విధి నిర్వహణలో లోపాలున్నాయని, తప్పు చేసిన ఉద్యోగులపై తగు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. తగు విచారణ జరిపి తప్పు చేసిన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పరిషత్ సభ్యులు రాజు, సూర రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

PLOT FOR SALE

HYD ఫోర్త్ సిటీ, ఫ్యూచర్ సిటీ, మహేశ్వరం, ముచ్చర్ల, కందుకూరులో ప్లాట్లు విల్లాలు, ఇండ్లు, ఫర్ సేల్... పిల్లల బంగారు భవిష్యత్తు.. శ్రీశైలం హేవే, Cont: 8008091512. [W-1239910]

SERVICES

వ్యక్తిగత, వ్యవసాయ, వ్యాపార, ప్రాపర్టీ కొరకు అతి తక్కువ వడ్డీతో రుణాలు ఇప్పించబడును, సిబిల్ అవసరం లేదు, NPA కూడా, దరఖాస్తు, హన్మకొండ ✆ 8790379618. [WA-6522]

CHANGE OF NAME

I, NIKKATH .MD, D/o. Azeez (Old Name) H.No.7-1-360/38/1, Laxmipuram, New Bus Stand Road, Hanumakonda, Hanumakonda Dist - 506001, T.S., India, have changed my name as ERITAM JAHNAVI, W/o. ERITAM RAM REDDY (New Name). [W-1239985]

VEHICLE FOR SALE

2022 Model EICHER PRO 2114 XP HHSD 20FT BS6, Registration number TS24T9837 Vehicle for Sale. M/s. Indusind Bank Ltd. Cont: 9849594648, 9959455260 [W-1239911]

2023 Model AL DOST PLUS LS FSD BS6.II Registration number TS24TA2480 Vehicle for Sale. M/s. Indusind Bank Ltd. Cont: 9849594648, 9959455260. [W-1239912]

FINANCE

హౌసింగ్, బిజినెస్, పర్సనల్, మార్టిగేజ్ & ఉద్యోగస్తులందరికి పర్సనల్ రుణాలు ఏ బ్యాంకులో అయినా ఇప్పించబడును & IT Returns, GST License చేయబడును. పద్మావతి ఫైనాన్స్ WGL. 9618767116. [W-1239971]

FINANCE SERVICES

సిరి అసోసియేట్స్: అన్ని రకాల రుణాలు, పర్సనల్, హౌసింగ్, మార్టిగేజ్, ఓపెన్ ప్లాట్స్‌పై & రిజిస్ట్రేషన్ చేయించి రుణాలు ఇప్పించబడును. సిబిల్ ప్రాబ్లం ఉన్నా చేయించబడును. 9666142226. [W-1239958]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ : 9010144453
వరంగల్ : 9705748198
నర్సంపేట : 9553955722
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.